క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరాపై సమీక్ష

ములకలచెరువు: మండలంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బురకాయలకోట, ములకలచెరువులో ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

ములకలచెరువు: మండల వ్యాప్తంగా హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక చికిత్సలు అందించాలని ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం మెడికల్ అధికారి లోకేష్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణుల కు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జాహ్నవి, సిబ్బంది ఉన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

పీలేరు రూరల్ : వాల్మీకిపురంలో దళిత నాయకుడు జయరామ్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎంఎస్‌పీ నాయకులు ఎన్. సుధాకర్ బాబు, ముల్లంగి చంద్రయ్య అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన సద్దాంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినా, పోలీసులు ఇంత వరకు విచారణ జరపలేదని ఆరోపించారు. నిందితున్ని వెంటనే అరెస్ట్ చేయకపోతే ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు శేషాద్రి, తిమ్మయ్య, సద్దల ప్రేమ్‌కుమార్, ప్రసాద్, రామాంజులు, కొండయ్య, బీసీ నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై ప్రత్యేక దృష్టి సారించండి

కలికిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించాలని గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. సోమవారం గుట్టపాళెం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లితండ్రీ, లేక తండ్రిని కోల్పోయి నిరాశ్రయులైన 18సం.లోపు పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని, అర్హులను గుర్తించాలన్నారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

నేడు గంగమ్మ జాతర

కురబలకోట: మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మ జాతరలో భాగంగా మంగళవారం రాత్రి చాందినీ బండ్లు మెరువన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూజారి అంజి తెలిపారు. బుధవారం పగలు తిరునాల, కళ్లి పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. జాతరకు వివిధ గ్రామాల నుంచి చాందినీ బండ్లు కడుతున్నట్లు తెలిపారు. జాతర ప్రశాంత నిర్వహణకు పటిష్ట బందోస్తును ఏర్పాటు చేసినట్లు రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు, ఎస్ఐ సుకుమార్ శనివారం తెలిపారు.

ఆర్టీసీని ఆదరించండి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీనీ ఆదరించాలని ఆర్టీసీ డిపో–1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం డిపో కార్యాలయంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల కోసం స్టార్‌లైన్ బస్సును మదనపల్లె–హైదరబాద్‌కు సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. తక్కువ చార్జీలతో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రతి సోమవారం మల్లయ్యకొండ, ప్రతి పౌర్ణమికి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నామన్నారు. ప్రయాణికులను గౌరవించి సంస్థ ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: చైత్రమాసం సందర్భంగా స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో గణపతి పూజ, గంగ పూజ, పుణ్యవహము, గోపూజ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, మంత్రపుష్పం, త్రయోదశి నమస్కారం, తదితర పూజలు చేశారు. అలాగే మహా మంగళ హారతి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భక్తి పారవశ్యం.. ప్రేమ వాత్సల్యం

- దివ్యసుగంధాలను వెదజల్లుతున్న రంజాన్
- ఉపవాస దీక్షపరులతో మసీదుల కళకళ
- ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం



సామూహిక ఇఫ్తార్



మసీదులో ప్రార్థనలు

మదనపల్లె సిటీ: మానవుల ఆచరణాత్మక సంస్కరణ.. అధ్యాత్మిక వికాసం.. ఆత్మీయత, అనురాగాల అనుబంధం.. ఆకలి నుంచి ఔన్నత్యానికి దైవం అందించిన మహత్తర అవకాశం రంజాన్ మాసం. పవిత్ర వాతావరణంలో శారీరక, మానసిక, సాధనతో నైతిక ప్రగతి సుసాధ్యం అని ఇస్లాం బోధిస్తుంది. భక్తి పారవశ్యానికి ప్రతీక అయిన ఈ మాసం ప్రేమ...వాత్సల్యాన్ని పంచుతోంది. విధిగా దానం(జకాత్) ద్వారా పేదలను అక్కున చేర్చుకునే శుభాల వసంతం రంజాన్ మాసం.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు

రంజాన్ మాసం సందర్భంగా శారీరక, ఆధ్యాత్మిక వికాసానికి సాధనమైన ఉపవాసాలు కొనసాగుతున్నాయి. మసీదుల్లో రంజాన్ సూచిగా హజాలు మారుమోగుతున్నాయి. మతపెద్దలు రంజాన్ నెలను ప్రకటించనప్పటి నుంచి మసీదు కమిటీలు ఆధ్వర్యంలో ఇఫ్తార్, సహర్ వేళలను పాటిస్తూ ఉపవాసాలు చేస్తున్నారు. సహనం, క్రమశిక్షణ లాంటి మహోన్నత వ్యక్తిత్వాలను అలవర్చే రోజాలను ఉపవాస దీక్షపరులు భక్తిశ్రద్ధలతో పాటిస్తున్నారు.

ఆధ్యాత్మిక వికాసానికి స్వాగత ద్వారం

రంజాన్ నెల ఆధ్యాత్మిక స్వాగతద్వారంలాంటిదని ముస్లింల భావన. అన్ని దుష్టకార్యాల నుంచి రక్షణ పొందేందుకే రంజాన్ శిక్షణగా భావిస్తారు. నెల రోజులు పాటించే ఆచరణలు మిగిలిన జీవితంలో తొణికిసలాడాలన్నదే రంజాన్ శిక్షణ ధ్యేయం. ఉపవాసాలు పాటించే ముస్లింలు ఈర్ష్య, ద్వేషం, అసత్యం పలకడం తదతర దుర్గుణాలను త్యజిస్తారు. ఉపవాసదీక్షపరుల్లో ఆత్మలో పవిత్రత నెల కొంటుంది. రాగద్వేషాలకు తావులేని వాతావరణం వెల్లివిరిస్తుంది. ఎలాంటి చెడులు లేని ప్రశాంత జీవితం దక్కుతుంది. ఉపవాసదీక్ష పాటించిన ప్రతి ముస్లింని రోజా పరిణితి కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

ఆత్మీయత, అనురాగాలు

రంజాన్ నెలంతా ప్రతి ముస్లిం ఇంట్లో దైవారాధనలు, పవిత్ర ఉపవాసదీక్షలు, పుణ్యకార్యాలు, అధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. ఉపవాసం పాటించేవారు తెల్లవారకముందే లేచి భోజనం ఆరగించాలి. దీన్ని సహరి అంటారు. సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు సైతం ముట్టరు. అనంతరం మసీదు సైరన్‌తో ఉపవాసం ముగిస్తారు. దీన్ని ఇఫ్తార్ అంటారు. మసీదులన్నీ నమాజులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర ఖురాన్ పఠనంతో తన్మయులవుతారు.

దయాగుణం అలవడుతుంది

రంజాన్‌మాసం కొందరు ముస్లింలలో ఉన్న పిసినారితనం, ధనార్జన గుణం తదితర దుర్గుణాలను పాగొట్టి, దానగుణాన్ని పెంపొందిస్తుంది. ఈనెలలో దానధర్మాలు అధికంగా చేయాలని మహమ్మద్ ప్రవక్త బోధించారు. ఒక్కొక్క పుణ్యకార్యానికి 70 రెట్లు అధిక పుణ్యఫలం ప్రసాదిస్తాడని ప్రవక్త బోధించారు. దీంతో ఆర్థికంగా సహాయం అందుతుంది. తమ సంపాదనలో 2.5 శాతం ధనాన్ని పేదలకు పంచాలని అల్లాహ్ ఖురాన్‌లో శాసనం చేశారు. సదఖా, జకాత్,ఫిత్రా దానాల ద్వారా పేదలకు రంజాన్ నెలలో ఆనందోత్సవాలతో పండుగ జరుపుకుంటారు. దీంతో వారి అవసరాలు తీరుతాయి. ఫలితంగా సమసమాజ స్థాపన జరుగుతుంది. ఆర్థిక సమస్యలకు పరిష్కారంగా జకాత్ ఉపయోగపడుతుంది. రంజాన్ నెలంతా ఇలా భయ,భక్తులతో ఉపవాసాలను పాటిస్తూ నమాజులను ఆచరిస్తూ ధాన,ధర్మాలను చేస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు గడుపుతారు. తరావీ నమాజులో ఇమామ్‌ల ద్వారా ఖురాన్‌లో కొంత భాగాన్ని రోజూ ఆలకిస్తారు. ఇలా చేయడం పుణ్యప్రదంగా భావిస్తారు. త్రికరణ శుదిగా ఖురాన్ బోధనలను పఠిస్తారు.

మృదు స్వభావం

సమాజంలో పేదసాదల ఆకలిదప్పులను రోజా(ఉపవాసదీక్షలు)లు తెలుపుతాయి. తోటివారి వ్యధాభరిత జీవితాన్ని కళ్లకు కడుతుంది. దీంతో తమ తోటివారు అనాధలు, అణగారిన వారిపై జాలి కలుగుతుంది. తద్వారా మృదుస్వభావం ఆలవడుతుంది. దీంతో వారి బాధలను కష్టాలని తీర్చేందుకు పాటుపడతారు.

వ్యవసనాలకు దూరంగా...

తాగుడు, జూదం, మత్తు పదార్థాలను సమలడం లాంటి దురలవాట్లు్కు 12 గంటల పాటు దూరమైతే అన్యక్తితో ఆయా వ్యసనాలను త్యజించే మానసిక సంసిద్ధత ఉద్భవిస్తుందని నమ్మకం.ఉపవాసాలు మనిషి అన్ని చెడులను దూరంగా చేసి, సత్కార్యాలను దగ్గర చేస్తాయి. అత్యుత్తమ శిక్షణనిస్తాయి.

ప్రవక్త బోధనలు పాటించాలి



రంజాన్‌మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసదీక్షలతో పాటు మహమ్మద్ ప్రవక్త బోధనలు పాటించాలి.రంజాన్ మాసంలో 30 రోజుల పాటు చేపట్టే ఉపవాసదీక్షలతో పేదల ఆకలి,బాద తెలుస్తుంది. దీంతో పేదలను ఆదుకోవడం జరుగతుంది. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఏదో విధంగా పేదలను ఆదుకోవాలి. పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ ఆశయం.

-హాఫీజ్ ఇక్బాల్ అహ్మద్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపలె

స్పందనలో సమస్యలపై వినతుల వెల్లువ



ఆర్డీఓ మురళికి సమస్యను వివరిస్తున్న బీటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు

మదనపల్లె : ఉద్యోగ విరమణ పొంది రెండున్నరేళ్లు కావస్తున్నా...ఇప్పటివరకు పెన్షన్‌కు నోచుకోలేదని, కుటుంబ పోషణ కష్టంగా ఉంటోందని బీటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు సోమవారం స్పందనలో ఆర్డీఓ మురళీకి అర్జీ సమర్పించారు. 36 ఏళ్లపాటు బీటీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేసిన తాను బీటీ కళాశాలకు కరస్పాండెంట్‌గా పనిచేసిన మిట్స్ విజయభాస్కర చౌదరి హయాంలో అవకతవకలకు పాల్పడినట్లు ఉద్యోగులు తప్పుడు ఫిర్యాదు చేయడంతో పెన్షన్ మంజూరు ఆలస్యమైందన్నారు. తర్వాత ఆడిట్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ టైపింగ్‌లో జరిగిన తప్పులు కారణం చూపుతూ పెన్షన్ మంజూరు కాకుండా చేశారన్నారు. రాయచోటిలోని జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు పెన్షన్ మంజూరులో నిర్లక్ష్యం కనపరుస్తున్నారని తెలిపారు. పెన్షన్ ఇప్పిస్తే వృద్ధాప్యంలో ఇబ్బందులు లేకుండా జీవనం గడిచిపోతుందని వేడుకున్నారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన పల్లంవీరయ్య 75 ఏళ్ల వయస్సులో భార్య మరణించి కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా వినతిపత్రం సమర్పించారు. భర్త మరణించిన తర్వాత తన కూతురు మస్తాన్‌బీ తన పేరుమీద ఉన్న ఇల్లు అమ్ముకోవడంతో పాటు బయటకు గెంటివేసిందని కురబలకోట మండలం సందిరెడ్డిగారిపల్లె మహబీబ్ ఫిర్యాదు చేసింది. వీటితోపాటుగా రెవెన్యూ సమస్యలపై అధికసంఖ్యలో ప్రజలు స్పందనలో అర్జీలు సమర్పించారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో నెహ్రూబజారులో కాలువ మరమ్మత్తు చేయాలని, సుభాష్‌రోడ్డు సెవెన్‌హిల్స్ వద్ద వీధిలైట్లు వెలగడం లేదని, గాంధ్లవీధిలో కాలువపై బండలు ఉండటంతో శుభ్రపరిచేందుకు కష్టంగా ఉందని చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీలకు ప్రజలు ఫిర్యాదు చేశారు.

ప్రజా సమస్యలపై స్పందించకపోతే చర్యలు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : ప్రజా సమస్యలపై స్పందించని ప్రభుత్వ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీ, బాటవారిపల్లె గ్రామాలలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి, గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీసీ కాలనీలో సిమెంట్‌రోడ్డు కావాలని కోరగా వెంటన అంచనాలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టాదారు పాస్‌బుక్కులో ఉన్నమేరకు భూమి ఆన్‌లైన్ కాలేదని కొందరు రైతులు తెలియజేశారు. ఇందిరమ్మ కాలనీలకు నగదు చెల్లించినా వన్‌టైం సెటిల్‌మెంట్ ధ్రువపత్రాలు మంజూరు కాలేదని లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఝరి కోన ప్రాజెక్ట్ లైన్ ఆపరేటర్లుకు నెలవారి జీతాలు రాలేదని తెలియజేయగా ఉన్నతాధికారులతో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సిగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, మండల కోఆప్షన్ సభ్యుడు ఇనాయతుల్లా, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్ నాయకులు రవికుమార్, జీవులక్రిష్ణ, జయప్రకాష్, నాగరాజ, రెడ్డెప్ప, హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాధవరెడ్డి, కుమార్‌నాయుడు, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వి, భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

తంబళ్లపల్లె: రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మండల రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు పరచాలని, చెల్లించాల్సిన డీఏలు మంజూరు చేయాలని, పీవోఎల్ఆర్ నిర్వహణ ఖర్చులు చెల్లించాలని, కొత్త పీఆర్సీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్వోల సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, ఆర్ఐ రవీల ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కళావతికి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీనివాసులు, భరత్‌నాయక్, రమణ ,పూజారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ మాక్ డ్రిల్



కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ మాక్ డ్రిల్‌ను ఏర్పాటు చేసినట్లు డీపీఎంవో డాక్టర్ లోకవర్థన్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ వార్డును తనిఖీ చేశారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ సోకిన వ్యక్తికి ఆసుపత్రికి వస్తే ఎలా స్పందించాలి.. బెడ్లు, ఆక్సిజన్లు, ర్యాపిడ్ కిట్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. గుమ్మికూడిన ప్రదేశాల్లో మాస్క్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, డాక్టర్ సోని పాల్గొన్నారు.

దీవించమ్మా.. పాలేటి గంగమ్మా



గంగమ్మ గుడి వద్ద బోనాలతో మహిళలు

కురబలకోట: కాలం మారుతున్నా చెదరని అస్థిత్వం. తరాలుగా వస్తున్న మరువని ఆచారం. కట్టుబాట్లును వీడని సంస్కృతి. సంప్రదాయానికి తరగని గౌరవం. కురబలకోట మండలం తెట్టు పాలేటి గంగమ్మ జాతరలో సోమవారం సాయంత్రం కన్పించిన ఈ దృశ్యం చూపరులకు ఉద్వేగాన్ని కల్గించింది. వందల మంది మహిళలు ఒక్కసారిగా డీలు బోనాలు నెత్తిన బుట్టతో రావడం ఆకట్టుకుంది. ప్రతి ఏటా పాలేటి గంగమ్మ జాతరలో భాగంగా పూజారివారిపల్లె పరిసర ప్రాంతాల మహిళంతా అమ్మవారికి డీలు, బోణాలు సమర్పిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితీ. అమ్మవారిపై భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను చాటారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దమండ్యం: పోషకాహారంతోనే గర్భిణులు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందుతారని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా పోషకాహారం, ఔషధాలపై డాక్టర్ ఇమ్మాన్యుల్ వివరించారు. గర్భిణులు రక్తహీనత తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు వారు కోరుకున్న ఆసుపత్రికి తరలించి సురక్షితమైన ప్రసవం జరిగేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించి పండ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ క్రిష్ణయ్య, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్ బాషా, ఎంపీటీసీ జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయండి

పీలేరు : ఈ నెల 17న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీలేరు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. సోమవారం ఏపీఐఐసీ లేఅవుట్–3లో మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ, మండలంలోని ఒంటిల్లు, ముడుపులవేముల, మేళ్లచెరువు, తలపుల, జాండ్ల, గూడరేవుపల్లె, పీలేరు పట్టణంలోని వినాయకనగర్, నాయీబ్రాహ్మణ కాలనీల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. సాయంత్రం ముస్లింల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారని చెప్పారు. ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, డీసీసీబీ డైరెక్టర్ మస్తాన్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష ఆదరణ

మదనపల్లె : 'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష ఆదరణ లభిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించే కార్యక్రమమే జగనన్న మా భవిష్యత్తు అని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 26వవార్డు సొసైటీకాలనీలో చైర్‌పర్సన్ ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడాలను వివరించారు. 12వవార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, 14వ వార్డులో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్‌ను అతికించి, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారధులు విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. కాలనీ చిన్న, కళావతి, నాగరాజనాయక్, నాగార్జున, అబీద్, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : మండంలోని పలు గ్రామ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చురుగ్గా చేపట్టారు. సోమవారం మండలంలోని గ్యారంపల్లె, సొరకాయల పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారధులు విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో కన్వీనర్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డెయ్య, కిషోర్‌రెడ్డి, దండు వెంకటరమణారెడ్డి, యల్లారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కలకడ : జగనన్న ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైస్ ఎంపీపీ జల్లా క్రిష్ణకుమారి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కోన గ్రామంలో జగనన్నే మా భవిషత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, చింతకుంట. హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు చౌడయ్య, రవీంద్ర, మాదవరెడ్డి, రామక్రిష్ణ, నాగరాజ, రామ్మోహన పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని నాయకులు పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల వలంటీర్లు, గృహ, సచివాలయ సారథులతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

వాల్మీకిపురం: ఎక్కడికి వెళ్లినా ప్రతి ఇంటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తోందని మాధవరంపల్లి సర్పంచ్ వెంకట్రమణ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాధవరంపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీళ్ల భాస్కర్, రాయుడు, ఆనంద పాల్గొన్నారు.

కలికిరి: మా భవిష్యత్తు జగనన్నే.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు పలు గ్రామాల్లో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుండ్లూరు, కలికిరి, గుట్టపాళెం, మహల్, అద్దవారిపల్లి తదితర గ్రామాల్లో నాయకులు గృహసారధులతో కలిసి ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు లబ్ధిపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, రెడ్డెప్ప, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చాంద్‌బాషా, రెడ్డెప్పరెడ్డి, మొలక సాంబశివారెడ్డి, మొలక బయ్యారెడ్డి, మధు, మధార్ పాల్గొన్నారు.

రామసముద్రం: జగనన్నతోనే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సోమవారం పేడ్రాజుపల్లెలో ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి , గుంతయంబాడిలో వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డిలు ఇంటింటా వెళ్లి స్టిక్కర్లు అంటించారు. అలాగే మూగవాడి పంచాయతీలో ఎంపీటీసీ భర్త రాధారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం సోమవారం విస్తత స్థాయిలో ఊరూరా కొనసాగింది. ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది ఎంపిక

పీలేరు రూరల్ : స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఇమ్మెన్స్‌పీర్ హెచ్ఆర్ వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షకు 190 మంది హాజరై 91 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. గ్రూప్ డిస్కసన్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలో 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ. 3.50 లక్షలు వేతనం అందుతుని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ సత్యరాజ్, కేశవగుప్త పాల్గొన్నారు.

ముతవల్లీగా ఖాజీ జలీల్ అహమ్మద్

వాల్మీకిపురం: గుర్రంకొండలోని అబ్దుర్ (రిపిట్ అబ్దుర్) రహ్మాన్ జామియా మసీదు ముతవల్లీగా ఖాజీ జలీల్ అహమ్మద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి వచ్చిన నియామక ఉత్తర్వును సోమవారం ఖాజీ జలీల్‌కు అందించారు. జామీయా మసీదుకు చెందిన 115.4 ఎకరాల వక్ఫ్ భూములను ముతవల్లీ అజీల్ పర్యవేక్షించనున్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

కలికిరి: పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలని బస్టాప్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ యువనాయకుడు చీనేపల్లి తరుణ్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సోమరవాం జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రతి రోజు 2500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, సర్పంచ్ వెంకటరెడ్డి, మధుసూదన్ రెడ్డి, గ్రామసచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప నాయకులు శివాజీ, ఫయాజ్, బావాజీ, ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచారభేరిని జయప్రదం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ ప్రచార భేరిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ అన్నారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండకడుతూ భారత్ బచావో – బీజేపీ హటావో పేరుతో దేశవ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని పూర్తి స్థాయిలో అవినీతిలో ముంచివేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, పుల్లయ్య, నాగరాజు, శ్రీనివాసులునాయక్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు సోమవారం పాలు, పండ్లు, బ్రెడ్డు అందజేసారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఇస్లామిక్ ట్రస్టు సభ్యులైన సులేమాన్, మహబూబ్‌బాషా, మస్తాన్, చాంద్‌బాషా, సిద్దిక్, ఆసిఫ్‌లు 70 మందికి ఈ కిట్లను అందజేసారు. స్థానిక సర్పంచ్ రహ్మాతుల్లా, వైద్య సిబ్బంది సమక్షంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం

మదనపల్లె : జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్వే ఉద్యోగులు, గ్రామ సచివాలయ సర్వేయర్లు సోమవారం సబ్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ సర్వేయర్ కృష్ణమూర్తి, ఏపీఎస్ఈఏ వైస్ ప్రెసిడెంట్ చక్రపాణి నాయుడు జాతీయ సర్వే దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. 1967లో భారతదేశంలో మొదటి బేస్‌లైన్‌ను ప్రారంభించి జార్జ్ ఎవరెస్ట్ హిమాలయాల ఎత్తును కొలవడం జరిగిందని, అందుకే ఆ శిఖరానికి సర్వేయర్ పేరుమీద ఎవరెస్ట్ పర్వతంగా పిలవడం జరుగుతోందన్నారు. కలకత్తా నుంచి ప్రారంభమైన సర్వే మొదటి జీటీ స్టేషన్ చెన్నైలో ప్రారంభించి దేశవ్యాప్తంగా సర్వేను విస్తృతం చేశారన్నారు. చైన్లు, లింకులతో ప్రారంభమైన సర్వే నేడు ఎలక్ట్రానిక్, సాటిలైట్ పరికరాలతో కచ్చితత్వాన్ని నిర్ధారించే స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర సర్వేను సర్వే ఉద్యోగులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను కనపరిచి మంచి ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలని గ్రామ సర్వేయర్లకు సూచించారు. కార్యక్రమంలో రీసర్వే జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.